సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 26 । మార్చి । 2023



భక్తుల వితరణ


నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ అమ్మవారికి దండుపాటి అశోక్‌కుమార్, చప్పిడి శ్రీనివాస్ కుటుంబసభ్యులు శనివారం వెండి పళ్లెం, చెంబును బహూకరించారు.




అన్నదానానికి విరాళం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో నిత్యాన్నదానానికి వల్లూరి వీరభద్రరావు (విరవ) శనివారం రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శనివారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1850, మధ్య డెల్టాకు 1200, పశ్చిమ డెల్టాకు 3200 క్యూసెక్కుల నీటిని వదిలారు.



న్యూస్‌రీల్

వాడపల్లి స్వామికి రూ.16.88 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా శనివారం రూ.16.88 లక్షల ఆదాయం సమకూరింది. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.10,98,600, అన్నప్రసాదం విరాళాలుగా రూ.2,25,545, వివిధ సేవల రూపంలో రూ.17,400, లడ్డూ విక్రయాల ద్వారా రూ 3,37,035, విరాళాలుగా రూ.9,745 లభించాయి. శనివారం ఒక్క రోజే ఈ ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 13,940 మంది హాజరు

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 38 కేంద్రాల్లో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 13,940 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 14,830 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 890 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ జనరల్ విభాగంలో 11,976 మందికి 11,417 మంది హాజరయ్యారు. 559 మంది పరీక్ష రాయలేదు. ఒకేషనల్ విభాగంలో 2,854 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 2,523 మంది హాజరయ్యారు. 331 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియెట్ బోర్డు డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

9 నుంచి తలుపులమ్మతల్లి పుట్టింటి సంబరాలు



తలుపులమ్మ జాతరపై చర్చిస్తున్న ఈఓ విశ్వనాథరాజు, చైర్మన్ అచ్చియ్యనాయుడు

తుని రూరల్: వచ్చే నెల 9 నుంచి 20వ తేదీ వరకూ తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు నిర్వహించాలని లోవ దేవస్థానం పాలక మండలి నిర్ణయించింది. లోవ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన ధర్మకర్తలు, అధికారులు, లోవ కొత్తూరు గ్రామస్తులతో శనివారం సమావేశం నిర్వహించారు. ధర్మకర్తలు, గ్రామస్తుల సూచనలు, సలహాల మేరకు 12 రోజుల పాటు అమ్మవారి పుట్టింటి జాతర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ప్రతి సంవత్సరం లోవ కొత్తూరు గ్రామంలోని నాలుగు ఎకరాల దేవస్థానం భూమిలో అమ్మవారి పుట్టింటి సంబరాలు, లోవ దేవస్థానంలో నెల రోజులు ఆషాఢమాసోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

ఇజ్రాయిల్ విజయయాత్రను విజయవంతం చేయాలి

అల్లవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన బొమ్మి ఇజ్రాయిల్ తొలిసారిగా ఈ నెల 28న జిల్లాకు వస్తున్నారు. ఆయన విజయ యాత్రను విజయవంతం చేయాలని మాదిగల పొలిటికల్ జేఏసీ శనివారం పిలుపునిచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా ముఖద్వారం రావులపాలెంలో విజయ యాత్ర ప్రారంభమై, కొత్తపేట, ముక్కామల, అమలాపురం, అల్లవరం మీదుగా గోడిలోని ఆయన ఇంటి వరకూ సాగుతుందని జేఏసీ నేతలు చేట్ల రామారావు, ఆకుమర్తి భాస్కరరావు, లూటుకుర్తి మూర్తి తదితరులు తెలిపారు.



కిళ్లీ స్వీట్



ఆపిల్ ఆకృతిలో..



జీడి మామిడి తరహాలో..



వాటర్ ఆపిల్‌ను తలపించేలా..



పసుపు- కుంకాలలో పెడుతున్న వివిధ రకాల స్వీట్లు

ఫ్రూట్ కాదు.. స్వీటే..

- వండ్లను మైమరపిస్తున్న మిఠాయిలు
- వివిధ రూపాల్లో తయారీ
- శుభకార్యాల్లో వీటిదే అగ్రస్థానం

సండే స్పెషల్



బత్తాయిని ప్రతిబింబించేలా..



ఆకర్షణీయంగా సిద్ధమైన డ్రై ఫ్రూట్ స్వీట్ ప్యాక్

సాక్షి, అమలాపురం: మామిడిలోని మాధుర్యం.. తేనెలొలికే సీతాఫలం.. తీపిని పంచే సపోటా.. ఇలా పండ్ల గురించి తెలియనివారెవ్వరూ ఉండరు. ఇవి ఏటా ఆయా సీజన్లలో రెండు మూడు నెలలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. కానీ అసలైన పండ్లను తలపించే రీతిలో వివిధ రకాల స్వీట్లు తయారు చేస్తూ.. ఏడాది పొడవునా వాటి మాధుర్యాన్ని మనకు చవి చూపిస్తున్నారు పలువురు తయారీదారులు. కలాకాని, కోవా, రసగుల్లా వంటి స్వీట్లను వివిధ రకాల పండ్ల రూపాల్లో తయారు చేస్తున్నారు. వాటికి అదనపు ఆకర్షణగా డ్రై ఫ్రూట్లు అద్దుతున్నారు. మామిడి, సపోటా, సీతాఫలం, చెర్రీ, స్ట్రాబెర్రీ, ఆరెంజ్, కివీ, జామ, జీడిమామిడి, వాటర్ ఆపిల్, బత్తాయి, ఆపిల్, పైనాపిల్, క్యారెట్, కొబ్బరి బొండాం, మొక్కజొన్న, గులాబీ ఫ్లేవర్ వంటి రకరకాల స్వీట్లను తయారు చేస్తూ వినియోగదార్లకు కొత్తదనాన్ని రుచి చూపిస్తున్నారు.

ఇప్పుడు శుభకార్యం అంటూ జరగాలే కానీ.. ఈ పండ్ల రకాల స్వీట్లు అగ్రస్థానంలో ఉంటున్నాయి. ముఖ్యంగా పెళ్లిళ్ల పసుపు కుంకాల సమయంలో ఈ స్వీట్లను పెండ్లివారింటికి తీసుకువెళ్లడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది. వీటిని ఎంత ఎక్కువగా తీసుకువెళ్తే అంత దాబు దర్పంగా మారింది. ఒకప్పుడు బొట్టు భరిణి, పటిక బెల్లం మాత్రమే ఇచ్చేవారు. రానురానూ పెండ్లివారికి ఇచ్చే స్వీట్లు.. పండ్లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎంత చెట్టుకు అంత గాలి అనట్టు.. ఎంత గొప్పవారైతే స్వీట్ల రకాలు అన్ని ఎక్కువగా ఉంటున్నాయి. తయారీదారులు సైతం అందం, ఆకర్షణీయంగా వీటిని తయారు చేస్తున్నారు. చివరకు వియ్యాల వారు ఇచ్చుకునే పటిక బెల్లానికి సైతం ఆకర్షణీయమైన అలంకరణలు చేస్తున్నారు. విందు సమయంలో సహపంక్తి భోజనాల్లో సైతం పండ్లను పోలి ఉండే స్వీట్లు కనిపిస్తూనే ఉన్నాయి. భోజనానంతరం తినే కిళ్లీని పోలి ఉండే స్వీట్లు కూడా తయారు చేస్తున్నారు. వీటి ధరలు సైతం ఘనంగానే ఉన్నాయి. ఒక్కో రకం స్వీట్ ధర కేజీ రూ.500 నుంచి రూ.1,500 వరకూ ధర పలుకుతోంది. పండ్ల రకాల్లోనే కాదు.. తిరగలి, రోళ్లు, రోకళ్లు, రుబ్బురోళ్లు, సన్నికల్లు రూపంలో కూడా స్వీట్లు ఆకర్షణీయంగా తయారు చేస్తూ పలువురు మిఠాయి కొట్టు యజమానులు సృజనాత్మకతకు పెద్ద పీట వేస్తున్నారు.



మామిడి పండు స్వీటు

ఆదరణ పెరిగింది



పండ్ల రూపంలో తయారు చేసే స్వీట్లకు ఇటీవల ఆదరణ పెరిగింది. గతం నుంచే వీటి తయారీ ఉన్నా, ప్రత్యేక బాక్సులలో ఆకర్షణీయంగా తయారు చేస్తున్నాం. పసుపు కుంకాలు, సీమంతాల ఫంక్షన్లకు అధికంగా ఆర్డర్లు వస్తున్నాయి.

– నల్లా శివాజీ, స్వీట్ల తయారీదారు, అమలాపురం

కొత్త రకాల స్వీట్లు కూడా..



గతం నుంచీ ఉన్న పండ్ల రకాలే కాదు.. మార్కెట్‌కు వచ్చే కొత్త తరహా పండ్లకు సంబంధించిన స్వీట్లు కూడా తయారు చేస్తున్నాం. వాటికి కూడా మంచి ఆదరణ లభిస్తోంది.

– జోగి చిరంజీవి, అమలాపురం

సమాజాభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర

జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమాజాభివృద్ధిలో శాస్త్ర, సాంకేతికత పాత్ర ఎంతో కీలకమైనదని జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ అన్నారు. శాస్త్ర, సాంకేతిక విద్యను అభ్యసించే యువ ఇంజినీర్లు పరిశోధనలు చేసి దేశ ప్రతిష్ఠ పెంచాలని సూచించారు. జేఎన్‌టీయూకేలో సివిల్, సీఎస్ఈ, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యాన రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సింపోజియం 'టెక్‌ఫెస్ట్ 23–23' శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కొత్త ఆవిష్కరణలు, వినూత్న పరిశోధనలు, స్టార్టప్‌లకు ఈ టెక్‌ఫెస్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు సాంకేతిక విజ్ఞానం మెరుగుపరచుకోడానికి టెక్‌ఫెస్ట్ వేదికగా నిలుస్తుందని చెప్పారు. పరిశోధక విద్యార్థులు సాంకేతిక విజ్ఞానం మెరుగుపరచుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. రిజిస్ట్రార్ సుమలత మాట్లాడుతూ, జాతీయ స్థాయి సింపోజియంలో పాల్గొని మేధావులతో మేధోమథనం చేసి, ఉన్నత స్థాయికి ఎదగవచ్చని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ఎం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, టెక్‌ఫెస్ట్‌ల ద్వారా నేర్చుకున్న ఆధునిక సాంకేతికతను తోటి స్నేహితులకు అందించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. సానుకూల దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగి కలలు సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. టెక్‌ఫెస్ట్‌లో భాగంగా పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ హెడ్ కోటేశ్వరరావు, సీఎస్ఈ హెడ్ శ్రీనివాసరావు, కృష్ణభాస్కర్, పెట్రోలియం కోర్సు అడ్వైజర్ కేవీ రావు, కో ఆర్డినేటర్లు డాక్టర్ కరుణ, సురేఖ, షమీంభాను, సూర్యరమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆసరాతో ఆర్థిక ప్రగతి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- జిల్లాలో డ్వాక్రా మహిళలకు రూ.253.76 కోట్ల జమ
- 2,97,079 మందికి లబ్ధి



జిల్లా డ్వాక్రా సంఘాలకు ఆసరా పథకం కింద విడుదలైన రూ.253.76 కోట్ల నమూనా చెక్‌ను మహిళలకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పేద మహిళల ఆర్థిక స్వావలంబనకు అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత పథకాలు వారి కుటుంబాలను ఆర్థిక ప్రగతి వైపు నడిపిస్తున్నాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సంఘటిత శక్తితో స్వయం ఉపాధికి బాటలు వేసుకునేందుకు ఆసరా పథకం ఆర్థిక పరిపుష్టిని అందిస్తోందని చెప్పారు. మూడో విడత ఆసరా పథకం లబ్దిని రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ విధానంలో శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో ప్రారంభించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2019 ఏప్రిల్ 11వ తేదీ లోపు డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించే ఏర్పాటు చేసిందని చెప్పారు. వారి రుణాలను మాఫీ చేసి, నాలుగు వాయిదాల్లో చెల్లిస్తోందన్నారు. జిల్లాలో మూడో విడత కింద 31,020 సంఘాల్లోని 2,97,079 మంది సభ్యుల బ్యాంక్ ఖాతాలకు ప్రభుత్వం రూ.253.76 కోట్లు జమ చేసిందని వివరించారు. లబ్ధి పొందిన మహిళలు మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారి, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల మాఫీ



మాది అమలాపురం ఒకటో వార్డు మెట్ల కాలనీ. శ్రీధనలక్ష్మి డ్వాక్రా సంఘం సభ్యురాలిగా ఉన్నాను. 2019 జనవరి నెల నాటికి మా సంఘానికి బ్యాంక్ లింకేజీ రుణం రూ.4 లక్షల బకాయి ఉంది. ఈ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి వర్తించింది. ఇప్పటి వరకూ మూడు విడతల రుణమాఫీ పొందాను. మాఫీ ద్వారా సమకూరిన డబ్బులతో టైలరింగ్ చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాను. నా కుటుంబం నిలదొక్కుకునేలా చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాను.

– వి.వెంకటేశ్వరి

నేత నేసుకుని జీవించేలా 'ఆసరా' సాయపడింది



మాది అమలాపురం రూరల్ మండలం బండార్లంక. స్వాతి డ్వాక్రా సంఘం సభ్యురాలిగా ఉన్నాను. డ్వాక్రా రుణమాఫీ ద్వారా మా సంఘానికి రూ.7.50 లక్షలు వస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా ఒక్కో సభ్యురాలు రూ.18 వేల చొప్పున అందుకున్నాం. మూడు విడతలుగా నాకు వచ్చింది రూ.54 వేలు. నేత నేసుకుంటూ మా కుటుంబం ఆర్థికంగా బలపడేందుకు ఈ డబ్బు ఆసరా అయింది. ముఖ్యమంత్రి జగన్ మేలు ఎప్పటికీ మర్చిపోలేం.

– మల్లీశ్వరి

క్షయ.. భయం లేదయా..

- 10 గ్రామాల్లో ఎస్ఎన్‌సీ సర్వే..
- రెండంటే రెండే కేసులు
- జాతీయ స్థాయిలో జిల్లాకు రజత పతకం



డాక్టర్ భారతలక్ష్మిని అభినందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: క్షయ వ్యాధి విషయంలో జిల్లాకు ఎటువంటి భయమూ లేదు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కింద జిల్లాలో ఎంపిక చేసిన 10 గ్రామాల్లో నిర్వహించిన సబ్ నేషనల్ సర్టిఫికేషన్ (ఎస్ఎన్‌సీ) సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈ సానుకూల ఫలితాలతో జిల్లా రజత పతకానికి ఎంపికైంది. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా వారణాసిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విషయం ప్రకటించారు. రాష్ట్రంలో ఎనిమిది జిల్లాలకు పతకాలు ప్రకటించగా అందులో మన జిల్లా కూడా ఉండటం విశేషం. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ద్రాప చింతలపూడి, ఉప్పూడి, ఎస్.యానాం, పోదలాడ, మాచవరం, గంటి, జి.పెదపూడి, రామచంద్రపురం పట్టణం, వేములపల్లి, కలవచర్ల గ్రామాల్లో గత డిసెంబర్ 22 నుంచి జనవరి 22 వరకూ ఈ సర్వే జరిగింది. 2025 నాటికి క్షయ వ్యాధి రహిత భారత్‌ను ఆవిష్కరించే లక్ష్యంతో ఏటా ఈ సర్వేలు చేస్తున్నారు.

సర్వే జరిగిందిలా.. : ఒక్కో గ్రామానికి ఇద్దరేసి చొప్పున 20 మంది ప్రైవేటు వలంటీర్లను నియమించారు. వారు ఆ పది గ్రామాల్లో క్షయ వ్యాధిపై ఇంటింటా సర్వే చేశారు. మొత్తం 10,049 ఇళ్లకు వెళ్లి, 26,709 మందిని సర్వే చేశారు. అనుమానం ఉన్న 231 నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపించారు. వారిలో ఇద్దరికి మాత్రమే క్షయ వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఈ సర్వేల్లో ఐదు లోపు టీబీ కేసులు వచ్చిన జిల్లాలకే కేంద్ర ప్రభుత్వం పతకాలు ప్రకటిస్తుంది. రెండు కేసులు మాత్రమే బయటపడటంతో మన జిల్లా రజత పతకానికి ఎంపికైంది.

నిర్ధారణ ఇలా.. : క్షేత్ర స్థాయిలో సర్వే బృందాలు ఇచ్చే నివేదికలపై పూర్తి స్థాయి పరిశీలన తరువాతే కేంద్ర ప్రభుత్వం ఫలితాలను ధ్రువీకరిస్తుంది. ఐదేళ్లకు పూర్వం జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు, ప్రైవేటు మెడికల్ షాపులకు ఎంత మంది టీబీ రోగులు వచ్చారు, ఎన్ని మందులు వాడారనే వివరాలు సేకరిస్తారు. చివరిగా సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌తో కూడా చర్చించి, ఎస్ఎన్‌సీ సర్వే నివేదికలోని అంశాలను పోల్చుకుంటారు. అనంతరం నామినల్ గ్రూప్ టెక్నికల్ (ఎన్‌జీటీ) సమావేశం నిర్వహించి సర్వేను పూర్తి స్థాయిలో నిర్ధారిస్తారు. జిల్లాకు సంబంధించి ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మిషన్ (ఐఏపీఎస్ఎం) అధిపతి డాక్టర్ సుజాత ఆధ్వర్యంలోని కమిటీ సర్వే నివేదికలపై అధ్యయనం చేసి నిర్ధారణకు వచ్చింది. గత జనవరి 29న అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ సుజాత అధ్యక్షతన ఎన్‌జీటీ సమావేశం జరిగింది. ముగ్గురు ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, ఇద్దరు ప్రైవేటు మెడికల్ షాపుల నిర్వాహకులు, ఒక డ్రగ్ హోల్‌సేల్ వ్యాపారి, ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌తో చర్చించి, పది గ్రామాల సర్వే నివేదికలపై అధ్యయనం చేసిన అనంతరం నిర్ధారణకు వచ్చారు. దీని ఆధారంగానే జిల్లా రజత పతకానికి ఎంపికైంది.

ఇది రెండోసారి



ఎస్ఎన్‌సీ సర్వేల ద్వారా గత సంవత్సరం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుంచి కాంస్య పతకం వచ్చింది. ఇప్పుడు రజత పతకం రావడం ఆనందంగా ఉంది. జిల్లాను పూర్తిగా క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్నాం. కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచనలు, సలహాలతో ముందుకు సాగుతూ, ఎస్ ఎన్‌సీ సర్వేలో సానుకూల ఫలితాలు సాధిస్తున్నాం.

– సీహెచ్‌వీ భారతలక్ష్మి, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి

అభినందనలు

క్షయ వ్యాధిపై చేసిన సర్వేలో జిల్లాకు రజత పతకం రావడం అభినందనీయం. గత ఏడాది కాంస్య పతకం సాధించిన స్ఫూర్తితో జిల్లాకు ఈ సంవత్సరం కూడా పతకం సాధించారు.

– కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసిన సందర్భంగా డాక్టర్ భారతలక్ష్మితో కలెక్టర్ హిమాన్షు శుక్లా

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించి, పూజలు చేసినట్టు అధికారులు తెలిపారు. స్వామి వారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి రెండు గంటలు, అంతరాలయ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

టీడీపీది బలం కాదు.. వాపు

- సీఎం జగన్ సంక్షేమ రథసారథి
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి, చిత్రంలో ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొడ్డిదారిన వచ్చిన విజయాన్ని చూసి టీడీపీ నాయకులు బలమనుకుని ఎగిరెగిరి పడుతున్నారని, అది బలం కాదు వాపు అన్న నగ్న సత్యాన్ని వారు గుర్తుంచుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. మండలంలోని ద్వారపూడిలో శనివారం మత్స్యకార కమ్యూనిటీ హాలు శంకుస్థాపనలో ఆయన, ఎంపీ చింతా అనురాధ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యాన, సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మోపిదేవి మాట్లాడారు. రాజకీయ వ్యవస్థను చంద్రబాబు నాయుడు భ్రష్టు పట్టించారని, రాజకీయాల్లో ధన ప్రవాహాన్ని తీసుకువచ్చి, వ్యవస్థలను నాశనం చేశారని దుయ్యబట్టారు. దొడ్డిదారిలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, ఎమ్మెల్సీని గెలిపించుకోవడం సిగ్గుచేటని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ రథసారథిగా పారదర్శక పాలన అందిస్తున్నారని కొనియాడారు. వ్యవస్థలోని లోపాలను సరి చేస్తూ ప్రజావసరాలకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తున్నారని మోపిదేవి గుర్తు చేశారు.

అమలాపురం ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమానికీ సీఎం జగన్ చేస్తున్న కృషి సమాజంలో ఆర్థిక, సామాజిక సమతుల్యత తీసుకు వస్తోందని అన్నారు. తద్వారా బడుగు బలహీన వర్గాల వారు అభ్యున్నతి సాధించగలుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారని అన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. తొలుత శ్రీరామగంగా ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యాన ఎంపీలు మోపిదేవి, అనురాధ, ఎమ్మెల్సీ తోటను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల పరిశీలకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి భవాని, నల్లమిల్లి మంగతాయారు, పుట్టపూడి అబ్బు, ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, నౌడు వెంకట రమణ, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నాటిక 'అంధస్వరం'

- ముగిసిన సీఆర్‌సీ జాతీయ తెలుగు నాటిక పోటీలు
- విజేతలకు బహుమతులు


ఉత్తమ ప్రదర్శన 'అంధస్వరం' నాటిక సభ్యులకు చెక్, షీల్డ్ అందిస్తున్న విప్ జగ్గిరెడ్డి. చిత్రంలో తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, గౌతంరాజు, సీఆర్‌సీ సభ్యులు

రావులపాలెం: ఉగాది పర్వదినం సందర్భంగా రావులపాలెం కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) ఆధ్వర్యాన కాటన్ కళావేదికపై ఈ నెల 22న ప్రారంభమైన జాతీయ తెలుగు నాటికల పోటీలు శుక్రవారం అర్ధరాత్రి ముగిశాయి. ప్రదర్శనల అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, సినీ నటులు తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, కృష్ణభగవాన్, కోట శంకరరావు, గౌతంరాజు, నైనా, ఇంద్రగంటి మోహన్‌కృష్ణ, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ వెలగల సతీష్‌రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్ గోపాలకృష్ణ, కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, పడాల సత్యనారాయణరెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి, చిర్ల కనికిరెడ్డి, నల్లమిల్లి వీరరాఘవరెడ్డి తదితరులు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి, జగ్గిరెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరానికి అందించాలనే సంకల్పంతో నాటక రంగానికి సీఆర్‌సీ అందిస్తున్న ప్రోత్సాహం ఎనలేదని కొనియాడారు.

ఉత్తమ ప్రథమ ప్రదర్శనగా కళలు కాణాచి (తెనాలి) వారి 'అంధస్వరం' నిలిచింది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా తెలుగు కళా సమితి (విశాఖపట్నం) వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?', ఉత్తమ తృతీయ ప్రదర్శనగా కళాంజలి (హైదరాబాద్) వారి 'రైతే రాజు' నాటికలు నిలిచాయి. ఉత్తమ ప్రథమ ప్రదర్శనకు రూ.3 లక్షలు, ద్వితీయ ప్రదర్శనకు రూ.2 లక్షలు, తృతీయ ప్రదర్శనకు రూ.లక్ష చొప్పున నగదు బహుమతులు, షీల్డులు అందజేశారు. ఉత్తమ నటనకు సంబంధించి మొదటి ఐదు స్థానాల్లో జి.నాగదుర్గ కుసుమసాయి (కాపలా నాటిక), వనార సహారిక కార్తిక్ (ఫ్రీడమ్ ఫైటర్), బి.రాధాకృష్ణ (ఎడారిలో వాన చినుకు), ఆర్.వాసుదేవరావు, కె.జాహ్నవి (అతడు అడవి జయించాడు నాటిక) అవార్డులు దక్కించుకున్నారు. యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ 'అతడు అడవిని జయించాడు' నాటికకు ఎస్.పవన్ కళ్యాణ్ (ఉత్తమ రంగాలంకరణ), యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ 'అతడు అడవిని జయించాడు' నాటికకు లీలామోహన్, ప్రశాంత్, విద్యాసాగర్ (ఉత్తమ సంగీతం), వరంగల్ శారదా నాట్య మండలి 'ఫ్రీడమ్ ఫైటర్' నాటికకు శ్రీధర్ పైడి (ఉత్తమ ఆహార్యం) అవార్డులు దక్కాయి.

ఇక నుంచి రెగ్యులర్

- అన్నవరం దేవస్థానానికి పూర్తిస్థాయి ఈఓగా చంద్రశేఖర్ అజాద్
- దేవదాయ శాఖ ఎస్టేట్ అధికారిగా సత్యనారాయణమూర్తి


నూతన ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ పూర్తి స్థాయిలో నియమితులయ్యారు. దేవదాయ శాఖలో ఎస్టేట్ అధికారిగా ఉన్న ఆయన ఇప్పటి వరకూ ఇన్‌చార్జి ఈఓగా సేవలందించారు. ఇప్పటి వరకూ ఇక్కడ రెగ్యులర్ ఈఓగా పని చేస్తూ, వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లిన ఎన్వీ సత్యనారాయణమూర్తిని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎస్టేట్ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ ఆదేశాలు జారీ చేశారు. ఇవి శనివారం ఉదయం దేవస్థానానికి చేరాయి. దేవస్థానంలో భక్తులకు మరిన్ని సేవలు అందించేందుకు గాను అజాద్‌ను ఇక్కడ నియమించినట్టు కమిషనర్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

పరిపాలనను చక్కదిద్దేందుకే..

అన్నవరం దేవస్థానంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయనే అభియోగంపై గత ఏడాది డిసెంబర్ 18వ తేదీన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, దేవదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ రత్నగిరిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం దేవస్థానంలో పరిపాలన అంత సజావుగా లేదని భావించి, కొన్ని ఆదేశాలిచ్చారు. మార్చి రెండో తేదీన గ్లోబల్ ఇండస్ట్రియల్ సమ్మిట్‌కు విశాఖపట్నం వెళ్తూ, సత్యదేవుడిని మంత్రి సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆ సందర్భంగా గతంలో ఇచ్చిన ఆదేశాల అమలుపై అధికారులను ప్రశ్నించారు. అయితే, దేవస్థానం పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. అదే సమయంలో ఈఓ సత్యనారాయణమూర్తి 15 రోజులు సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో అజాద్‌ను ఇన్‌చార్జిగా కమిషనర్ నియమించారు. భక్తుల సౌకర్యాల విషయంలో గడచిన మూడు వారాలుగా ఆయన ఎటువంటి రాజీ పడకుండా వ్యవహరించారు. పలు విభాగాలను స్వయంగా తనిఖీ చేసి, సిబ్బందిని పరుగులు పెట్టించారు. స్వయంగా గుర్తించిన వాటితో పాటు, మీడియాలో ముఖ్యంగా 'సాక్షి' పత్రిక వెలుగులోకి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంపై గడువు విధించి, తప్పనిసరిగా మార్పు కనిపించాలని ఆదేశించారు. అంతేకాదు.. చెప్పిన పని జరిగిందో లేదో పరిశీలించారు. ఏ పని ఎంతవరకూ వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో పాటు, భక్తులు కూడా సంప్రదాయ దుస్తులు ధరించాలని, బొట్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని ఆదేశించారు. ఇటువంటి వరుస పరిణామాల నేపథ్యంలో అజాద్‌నే ఇక్కడ పూర్తి స్థాయి ఈఓగా నియమించారు. వచ్చే నెల 30 నుంచి మే ఆరో తేదీ వరకూ సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాలు, జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్ నిర్మాణం వంటివి ఆయన హయాంలోనే జరిగే అవకాశాలున్నాయి.

ఆపద వేళ.. ఆదుకుంటాం ఇలా..


మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది


గోదావరిలో మునిగిన వారిని ఫైబర్ బోటు ద్వారా రక్షిస్తాం ఇలా..

- ఆకట్టుకున్న ఎన్డీఆర్ఎఫ్ దళాల మాక్ డ్రిల్
- పాల్గొన్న పోలీసు, ఫైర్, రెవెన్యూ సిబ్బంది

యానాం: ఆపదల వేళ ఆదుకునే విధానాన్ని వివరిస్తూ ఎన్డీఆర్ఎఫ్ దళాలు శనివారం నిర్వహించిన మాక్ డ్రిల్ అందరినీ ఆకట్టుకుంది. పుదుచ్చేరి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యాన గౌతమీ గోదావరిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా వరదల సమయంలో వివిధ ప్రభుత్వ శాఖలు నిర్వహించాల్సిన అత్యవసర రక్షణ చర్యలు, ఇతర అంశాలపై ఎన్డీఆర్ఆఫ్‌తో పాటు పోలీసు, అగ్నిమాపక దళం, రెవెన్యూ, ఆరోగ్య, విద్యుత్, పీడబ్ల్యూడీ తదితర శాఖల సిబ్బంది ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు.


నీటిలో మునిగిన వారికి ఊపిరి పోస్తూ..

గోదావరి వరదలో చిక్కుకున్న బాధితులను ఒడ్డుకు చేర్చడం, ప్రథమ చికిత్స అందించడం, అనంతరం ఆసుపత్రికి తరలించడం వంటి ఎక్సర్‌సైజులు ఆకట్టుకున్నాయి. వరద ఉధృతి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందరికీ చేరవేసే తీరును వివరించారు. మాక్ డ్రిల్‌లో యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి (ఆర్ఏఓ) మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, డిప్యూటీ తహసీల్దార్ గణేశన్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.


ప్రత్యేక సూట్ ధరించి నీటి లోపలికి వెళ్లేందుకు రెడీ..

ఆస్తి వివాదం.. కుమారులపై కేసు

పి.గన్నవరం: ఆస్తి వివాదం నేపథ్యంలో విశ్రాంత సీఐ కుమారులు ఇద్దరిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి.మురళీ మోహన కృష్ణ కథనం ప్రకారం.. పి.గన్నవరానికి చెందిన విశ్రాంత సీఐ డి.రామసత్యనారాయణ భార్య ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో ఆస్తి కోసం తండ్రి, ఇద్దరు కుమారుల మధ్య వివాదం చోటు చేసుకుంది. రామసత్యనారాయణ శుక్రవారం రాత్రి ఇంట్లోని తన గదిలో ఉండగా.. కుమారులు నీలాద్రిపాణి, సుమపాణి తలుపులు పగులగొట్టి ఆస్తి పత్రాలు ఇవ్వాలంటూ దౌర్జన్యం చేశారు.

తండ్రికి చెందిన బ్యాంకు పుస్తకాలు, ఆధార్ కార్డులు, ఇతర పుస్తకాలు బయట పడేసి దగ్ధం చేశారు. తమ పేరిట ఆస్తి రాయకపోతే చంపుతామంటూ ఇద్దరు కుమారులూ తనను బెదిరించినట్టు రామసత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జగన్ హయాంలో బీసీలకు అగ్రాసనం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య ప్రశంస


రాయుడు రాకేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న కృష్ణయ్య..చిత్రంలో జక్కంపూడి రాజా తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం సిటీ): బీసీల పక్షాన నిలబడిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కొనియాడారు. 'హలో బీసీ.. చలో రాజమహేంద్రవరం' పేరిట స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఎంతో మంది బీసీ విద్యార్థులు ఇంజినీర్లుగా, డాక్టర్లుగా ఎదిగారన్నారు. బీసీలు రాజకీయ రంగంలో కూడా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల 18 ఎమ్మెల్సీ సీట్లకు గాను ముఖ్యమంత్రి జగన్ బీసీలకు 11 కేటాయించారని, మంత్రివర్గంలో కూడా 11 మందికి స్థానం కల్పించారని గుర్తు చేశారు. అలాగే బీసీల అభివృద్ధికి రూ.38 వేల కోట్లు కేటాయించారన్నారు.

కేంద్రం పిసరంత బడ్జెట్

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లతో పాటు రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్లపై కేంద్రంతో పోరాడుతూనే ఉంటామని కృష్ణయ్య చెప్పారు. కేంద్రం బడ్జెట్‌లో బీసీలకు అతి తక్కువ కేటాయించిందన్నారు. రూ.2 లక్షల కోట్లు కేటాయించి, ప్రతి కుటుంబానికీ రూ.10 లక్షల సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. క్రీమీలేయర్ ఎత్తివేయాలని, హైకోర్టు, సుప్రీంకోర్టులో జడ్జి పోస్టుల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన రాయుడు రాకేష్(కాకా)కు ఆయన నియామక పత్రం అందజేసి అభినందించారు.

రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ, తమ కుటుంబ రాజకీయ ఎదుగుదల వెనుక బీసీల అండ ఎంతో ఉందని అన్నారు. చట్టసభలో బీసీల గళం వినిపించడానికే కృష్ణయ్యకు జగన్ రాజ్యసభ అవకాశం కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రాంతీయ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ బోను దుర్గానరేష్ యాదవ్, నాయకులు నరవ గోపాలకృష్ణ, కోడి ప్రవీణ్ పోతుల వరప్రసాద్, పితాని ప్రసాద్, హేమ, డాక్టర్ అనుసూరి పద్మలత, శ్రీదేవి, తుల్లి పద్మావతి, వాసంశెట్టి పెద్ద వెంకన్న, కొండ్రపు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.